# గలగలా గోదారి

-భైరవయ్య

"ఎదవ సచ్చినోడు" అని కొందరు మెటికలు విరిచారు.

"పిశాచపెదవ" అని కొందరు నేల మీద ఖాండించి వుమ్మేశారు.

"ఈడికి పొయ్యే కాలమొచ్చింది" అని కొందరు తిట్టారు.

"రాక్షస ముండాకొడుకు" అని కొందరునిర్ధారణ

"కలికాలమండీ" అని కొందరు పెదవి విరిచారు.

ఇవన్నీ భరిస్తూ భరిస్తూ సాంబయ్య గోదావరొడ్డున నీళ్ళోడుతూ, మోకాళ్ళలో తలపెట్టుకు కూర్చు నున్నాడు. వాడెదురుగుండా, నవ్వు మాయని మొహంతో పిచ్చిదేముడి శవం పడుంది. ఆ శవం కూడా నీళ్ళోడుతూ వుంది. నీళ్ళోడుతున్నా నిప్పులా వెలుగుతూ వుంది. ఆకాశం కూడా నీళ్ళోడుతూ మధ్య మధ్య నిప్పుల్ని మెరుస్తోందిరా.

రైలు పట్టాలు ఆ వూరిదాకావచ్చి ఆగిపోయాయిరా అబ్బాయ్. నాగరికత కూడా ఆ వూరి దాకా వచ్చి ఆగిపోయింది. కోనసీమ వెళ్ళాలంటే ఆ వూరి దాకా రైలు మీదొచ్చి, కాలినడకనో, ఒంటెద్దు బండిలోనో వశిష్ఠ వొడ్డుకి వెళ్ళి, అక్కడ పడవెక్కేవారు. రుస్తుంబాదా, మొగల్తూరు వెళ్ళేవాళ్ళు అక్కడే రైలు దిగి నడిచి వెళ్ళిపోతారు; బుజాల మీదో నెత్తి మీదో పిల్లల్నీ, బరువుల్నీ మోసుకుంటూ. ఆ వూరు తాలూకా కేంద్రమయినా, వ్యాపారానికి కేంద్రం పాలకొల్లే. అందుకనా వూరు ఎదిగీ ఎదగనట్టే వుండిపోయింది. రైలు స్టేషను కూడా వూరికి క్రోసెడు దూరంలో వుండేది. రైలొచ్చినప్పుడు తప్ప ఆ స్టేషన్లో హడావుడే వుండేది కాదు. ఆ వూళ్ళోలాగే ఆ స్టేషన్లో కూడా చైతన్యం అంతగా వుండేది కాదు. ఆ వూళ్ళో కూడా బజారు వీధి తప్ప మిగతా వీధులన్నీ ఎక్కువ భాగం నిశ్శబ్దాన్నే పోషిస్తూ వుండేవి. ఆ బజారు కూడా రాత్రి ఎనిమిదయ్యేసరికి నిశ్శబ్దాన్నే వరిస్తూ వుండేది.

అలా ఆ వూరు ప్రభవిస్తున్న తరుణంలో, పిచ్చిదేముడు అడుగుపెట్టాడ్రా అబ్బాయ్. తాటిదుబ్బు లాంటి తలా, బీటలు తీసిన సైరు పొలంలాంటి ఒళ్ళూ, కలుపుమొక్కల్తో సహా పీకేసిన వరిపొలంలా ఆచ్ఛాదన లేకుండా, స్వచ్ఛమైన వెన్నెల్లాంటి నవ్వే ఆభరణాంబరాలవగా, ఆ పిచ్చిదేముడు ఆ స్టేషన్లో అడుగుపెట్టాడ్రా అబ్బాయ్. అడుగు పెట్టిన ఆ పిచ్చిదేముడు రైలొచ్చేటప్పుడే తెరిచే టీ కొట్టు దగ్గరకెళ్ళాడ్రా అబ్బాయ్. ఆ టీకొట్టు పాపారావుది. సదరు పాపారావు ఎవరికో టీ కలిపి బల్ల మీద పెట్టాడు. ఆ టీ పిచ్చిదేముడు అందుకున్నాడ్రా అబ్బాయ్. అది చూసిన పాపారావు విరుచుకుపడ్డాడ్రా.

"అడుక్కునే లం...కొడుక్కి యెంత గీర్వాణం. ఈ టీ కొట్టు నీ బాబుగాడిదేటో" అంటూ పిచ్చిదేముడి చేతిమీద కొట్టాడు. ఆ టీ గ్లాసు జారి పిచ్చిదేముడి కాలిమీద పడి, ఆ వేడి టీకి అతని కాలు కాలి, ఆ గ్లాసు తాకిడికి చిన్న గాయం అయింది. అప్పుడు పిచ్చిదేముడు పడీపడీ నవ్వుకుంటూ రోడ్డున పడ్డాడ్రా.

అబ్బాయ్ ఎలా జరిగిందో తెలియదు కాని, మరుగుతున్న టీ డికాషన్‌తోపాటు, రాక్షసి బొగ్గులతో మండుతున్న ఇనప పొయ్యి కూడా పాపారావు కాళ్ళమీద పడిపోయిందిరా. చుట్టుపక్కల వాళ్ళందరూ హడావిడిగా, ఆ నిప్పుల్ని ఆర్పి, పాపారావుకి శైత్యోపచారాలు చేసారు. వాళ్ళలో ఎవరో, 'ఆ పిచ్చాడిని కొట్టిన ఫలితం వూరికే పోతుందా. పిచ్చాళ్ళలో దేముడుంటాడు' అన్నారు.

## పిచ్చి దేముడు

అలా రోడ్డున పడ్డ పిచ్చిదేముడు రోడ్డుదాటి, కాలవకి అడ్డం పడి వూళ్ళోకొచ్చాడ్రా అబ్బాయ్

సుబ్బయ్య రోడ్డువారగా పీట మీద కూచుని, పెసర పుణుకులు వేయిస్తున్నాడు. ఆ రోడ్డు పడవల రేవుకి వెళుతుంది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా వుంటుం దిలే. బజారు కూడా అక్కడనించే ప్రారంభమవు తుంది. అందువల్ల సుబ్బయ్య పుణుకుల వ్యాపారం ఓ మోస్తరుగా బాగానే వుంటుంది. జీవితం కొట్టిన దెబ్బలు తిని తినీ, ఏ పనీ కలిసిరాక, ఆఖరికి పెసర పుణుకుల వ్యాపారం ప్రారంభించాడు సుబ్బయ్య. అప్పట్నించీ ఒక పూట తిండి తింటోంది సుబ్బయ్య కుటుంబం.

ఆ సుబ్బయ్య దగ్గరకొచ్చాడ్రా అబ్బాయ్, పిచ్చిదేముడు. వచ్చిన పిచ్చిదేముడు చలనంలేకుండా అలాగే నిలబడ్డాడు, ఉలుకూ పలుకూ లేదు.




మంగలంలోంచి పుణుకులు తీసిన సుబ్బయ్య, ఎదురుగా నిలబడ్డ పిచ్చిదేముణ్ణి చూసాడు. ఏమనుకున్నాడో యేమో, "ఆకలేత్తాందా" అనడిగాడు.

పిచ్చిదేముడు నవ్వాడు.

నాలుగు పుణుకులు తామరాకులో వేసి, పైన పచ్చడేసి యిచ్చాడు సుబ్బయ్య.

ఆ పుణుకులందుకుని, ఒక్క గుక్కలో తినేసి, పకపకా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడ్రా అబ్బాయ్, పిచ్చిదేముడు.

ఆ తరువాత ఎక్కడ నుంచి వచ్చారో తెలియదు ప్రవాహంలా జనం వచ్చారు. సాయంత్రం దాకా సరిపోతుందనుకున్న పెసరపిండి అపరాహ్ణం దాటకుండా అయిపోయింది.

వెర్రి జనం కదరా అబ్బాయ్, స్టేషన్లో జరిగిన భోగట్టా, సుబ్బయ్యకి పట్టిన అదృష్టమూ, సూరీడు పడమటకి వెళ్ళకుండా వూరంతా తెలిసిపోయింది. అంతే, పిచ్చిదేముడు నిజంగా పిచ్చిదేముడయిపోయాడు.

పిచ్చిదేముడిలో ఒక విచిత్రముందిరా అబ్బాయ్. అవి కాళ్ళో చక్కగా అమర్చిన యంత్రాలో తెలియదు గాని, నిరంతరం తిరుగుతూ వుంటాడు. నిలబడటమే తప్ప, అతను కూచోగా, పడుకోగా, ఎవరూ చూడలేదురా. మండువేసవయ్యేది, జడివాన అయ్యేది, ఎముకలు కొరికే చలికాలమయ్యేది అతను నిత్యసంచారి. శ్రీశుకులవారు ఏడు ఘడియలు మించి ఎక్కడా వుండేవారు కాదని ప్రతీతి. పిచ్చిదేముడు ఎక్కడా ఏడు నిమిషాలు మించి వుండేవాడు కాదు. ఒంటికి ఆచ్ఛాదననేది వుండేదే కాదు. తిట్టినా, ఆదరించినా పిచ్చిదేముడు నవ్వేవాడ్రా. ఆ నవ్వెలా వుండేదనీ, గవ్వలు గలగలలాడించినట్టు మంచి ముత్యాలు దొర్లించినట్టు వుండేది.

పిచ్చిదేముడెక్కడివాడో తెలియదు. ఎందుకొచ్చాడో తెలియదు. పగలంతా గోదావరొడ్డున నడుస్తూ వుండేవాడు. చెట్లనీ, చేమల్నీ, వశిష్ఠ పాత్తిళ్ళలో పదిలంగా సాగిపోతున్న పడవల్నిచూసి నవ్వుతూ వుండేవాడు. నీటి మీద ఎగిరే పక్షుల్ని చూసి నవ్వేవాడు. నీటిలో ఎగసిపడే చేపల్నిచూసి నవ్వేవాడు. అలా నవ్వుతూ తిరుగుతూ ఏ సంజెవేళకో వూళ్ళోకి ప్రవేశించేవాడు. ప్రవేశించిన పిచ్చిదేముడు, ఏ మిఠాయి కొట్టు దగ్గరో, ఏ యింటి గుమ్మం ముందో నిలబడేవాడు. నిలబడి నవ్వే వాడు.. నవ్వి వెళ్ళిపోయేవాడు. రాత్రంతా వూళ్ళోనే సంచారం చేసేవాడు పకపకా నవ్వుకుంటూ.

పిచ్చిదేముడు ఏదన్నా తింటే శుభం జరుగుతుందనీ, అతను ఏదైనా తీసుకుంటున్నప్పుడు అడ్డు పడితే అశుభం జరుగుతుందనీ వూరంతటికీ నమ్మకం కలిగిందిరా అబ్బాయ్. అందుకని, పిచ్చిదేముడు వూళ్ళో

ప్రవేశించే సమయానికి చాలామంది ఏదో ఒక తిను బండారం పట్టుకుని గుమ్మంలో నిలబడి వుండేవారు. దుకాణాలవాళ్ళు ఆత్రుతగా ఎదురుచూసేవారు. పిచ్చి దేముడు ఎక్కడ ఆగుతాడో తెలియదు. ఎవరి దగ్గర తింటాడో తెలియదు. తినడమంటే ఎంత, ఓ గుప్పెడు. బలవంతంగా తినిపిస్తే, ఉరుములా నవ్వేవాడు. అందు కని ఎవరూ బలవంత పెట్టేవారుకాదు. ఎవరైనా మొలకి గుడ్డముక్క చుట్టేవారు. అదెప్పుడు జారిపోయేదో చుట్టినవాళ్ళకీ తెలియదు. పిచ్చిదేముడికసలే తెలియదు.

తీరని కష్టాల్లో వున్నవాళ్ళ దగ్గరకే వెళ్ళేవాడురా పిచ్చి దేముడు. వాళ్ళ దగ్గర ఏమీ లేకపోతే కుండలోంచి పులిసెడునీళ్ళు తాగి పకపకా నవ్వుతూ వెళ్ళిపోయే వాడు. పిచ్చిదేముడితోపాటు వాళ్ళ కష్టాలు మాయమయి పోయేవిరా. ఎక్కడ దుఃఖముంటే అక్కడ పిచ్చి దేముడు అడుగు పెట్టేవాడురా. అడుగు పెట్టి నవ్వే వాడురా.అందుకే అతగాడు దేముడయ్యాడు.

అటువంటి పిచ్చిదేముడి మీద సాంబయ్య కన్ను పడిందిరా అబ్బాయ్.

సాంబయ్య ఆ వూర్లో పెద్ద షావుకారు. డబ్బు సంపాదన తప్ప మరో వ్యాపృత్తి లేదు. అది సంపాయించ డానికి నెయ్యని పని లేదు. వంద రూపాయల కనీస లాభముంటే కాని, కానీ ఖర్చు పెట్టేవాడు కాదు. చిరిగి పోయిన అంగవస్త్రం తప్ప మరోటి కట్టేవాడు కాదు. జంధ్యం కూడా బ్రాహ్మడి దగ్గర తీసుకుంటే అర్థ రూపాయి దక్షిణ ఇవ్వవలసి వస్తుందని దుకాణంలో పొట్లాలు కట్టే దారంతోటి తనే తయారుచేసుకునే వాడు.

ఆ సాంబయ్య ఆ యేడు గోదావరికవతల లంకలో కొబ్బరికాయంతా కొనెయ్యడానికి బయానా యిచ్చే శాడు. ఆ యేడు కొబ్బరి చెట్లు విరగకాసేశాయి. ఎంత హీన పక్షంగా చూసుకున్నా లాభం లక్ష పైచిలుకే వుండాలి అప్పటి లెక్కన. సాంబయ్య మహదానంద పడుతున్నాడురా. తన బాన పొట్ట పట్టనంతగా ఆనంద పడుతున్నాడు.

సాంబయ్య సదరు ఆనందాన్ని భగ్నంచేస్తూ గాలివాన వచ్చిందిరా అబ్బాయ్. దానికి తోడు గోదావరి వురక లేస్తోంది. ఏ క్షణమైనా వూళ్ళకి వూళ్ళు తుడిచిపెట్టుకు పోయేలా వున్నాయి. సాంబయ్యకి దిక్కు తోచలేదు. మెరుపులా పిచ్చిదేముడు గుర్తుకొచ్చాడు. ఆదరాబాదరా ఆ గాలివానలో పరిగెత్తి పిచ్చిదేముడ్ని పట్టుకుని బరబరా యింటికీడ్చుకొచ్చాడు. ఒంటి చుట్టూ దుప్పటి కప్పి, నోట్లో అన్నం కుక్కి కుక్కి పెట్టాడు.

పిచ్చిదేముడు, ఆ దుప్పటిని ఒంటి మీంచి విసిరేశాడురా. నోట్లో కుక్కిన అన్నాన్ని వుమ్మేశాడు. వుమ్మేసిన పిచ్చిదేముడు నవ్వాడురా. పిడుగులు పడ్డట్టు నవ్వాడు. గుండెలవిసి పడేట్టు నవ్వాడు. నవ్వుతూ చీకట్లోకి, గాలివానలోకి వెళ్ళిపోయాడురా. ఉక్రోషం పట్టలేని సాంబయ్య పిచ్చిదేముడి వెంటపడ్డాడురా అబ్బాయ్. పిచ్చిదేముడు దొరకలేదు.

ఈ లోపున గోదారి పొంగింది. గుండెల్లో దుఃఖం కట్టలు తెగినట్టు పొంగింది. లంకల్ని తనలో కలిపేసు కుంటూ పొంగింది. చెట్లని వేళ్ళతో సహా పెకలిస్తూ పొంగింది. ఈ ఒడ్డున నిలబడి చూస్తే నీరు తప్ప మరోపదార్థం అవతలి ఒడ్డున కనిపించనంతగా పొంగింది.

సాంబయ్య పిచ్చిదేముడి కోసం వెతుకుతున్నాడురా. తను నాశనం కావడానికి పిచ్చిదేముడే కారణమన్న పిచ్చి నమ్మకంతో గాలి వానలా భోరుమంటున్న సాంబయ్య పిచ్చిదేముణ్ణి వెతుకుతున్నాడురా.

వెలుగు రేకలు వెక్కిరిస్తోంటే, గోదారొడ్డున నిల బడి ఏడుపో నవ్వో తెలియకుండా పగలబడి నవ్వుతున్న పిచ్చిదేముడు కనిపించాడురా సాంబయ్యకి.

ఆవేశం పట్టలేని సాంబయ్య పరుగునొచ్చి, పిచ్చి దేముణ్ణి ఎత్తి గోదాట్లోకి విసిరేసాడురా. నవ్వుతూనే పిచ్చి దేముడు మునకలేసాడురా. ఆ తరవాత శబ్దం లేదురా. కొంతసేపటికి శబ్దం లేని నవ్వు మొహంతో పిచ్చిదేముడి కట్టె అల్లంత దూరంలో తేలిందిరా.

సాంబయ్యకేమయిందో తెలియదురా అబ్బాయ్. "అయ్యో నా దేముడో" అంటూ గోదార్లోకి దూకేశా డురా. ఎలా పట్టుకున్నాడో పిచ్చిదేముడ్ని పట్టుకుని, వరద కెదురీదుతూ పళ్ళ బిగువున ఒడ్డుకొచ్చి పడ్డాడురా అబ్బాయ్. ఒడ్డునున్న వాళ్ళ తిట్లన్నీ పడ్డాడు. పల్లెత్తు మాటనలేదు.

ఆ పిచ్చిదేముడి శవాన్ని గోదావరొడ్డునే పాతిపెట్టి, స్వయంగా మట్టి పిసికి, ఇటికలు చేసి సమాధి కట్టాడు. తాటాకులు నరికి పందిరేసాడు. తను ఆ సమాధి దగ్గరే వుండిపోయాడు.

ఆ సాంబయ్య, ఆ సమాధీ ఈపాటికి కాలగర్భంలో కలిసిపోయినా, ఇప్పటికీ పిచ్చిదేముడి నవ్వు రాత్రుళ్ళు వినిపిస్తూ వుంటుందని చెప్పుకుంటూ వుంటారు.

*

## సరిగమలు

## 'కాఫీ' రాగం

ఆదివారం ఏం తోచక సుగుణా వాళ్ళింటికి బయల్దేరింది శారద. ఇద్దరూ లోపల గదిలో కూర్చుని కబుర్లలో పడ్డారు. పక్కవాటా నుండి సన్నగా సంగీతం విన్పించింది. ఎవరా అని అడిగింది శారద.

'మా పక్కవాళ్ళమ్మాయి'. పదేళ్ళుం టాయి. చిన్నపిల్ల. నన్నడిగారు నీ స్నేహితురాలు చెప్తుందిగదా! అని. కానీ నీ స్కూలు దూరం అని ఇక్కడే ఓ అమ్మాయిచేత చెప్పిస్తున్నారు. కొంచెం పెద్దయ్యాక నీ దగ్గరికి పంపిస్తారుట' అని వివరాలు గడగడా చెప్పేసింది సుగుణ.

'ఎవరిదగ్గరైతేనేం నేర్చుకోవడం ముఖ్యం' అంది శారద. వరండాలోకెళ్ళి కిటికీ దగ్గరగా పోయి కొంచెం తొంగిచూసింది. శంకరాభరణం రాగంలో గీతం చెప్తోంది. శారద ఇంకొంచెం ముందుకు వంగి ఆ టీచర్ వంక చూసి ఆశ్చర్యపోయింది. ప్రమీల—అవును ప్రమీలే—ఈ అమ్మాయి అప్పుడే సంగీత పాఠాలు కూడా చెప్తోందా! ఆ అమ్మాయికే సరిగ్గా తాళం వెయ్యడం చాతకాదు. ప్రస్తుతం తన దగ్గరే నేర్చుకుంటోంది—ఇంతలో చటుక్కున గుర్తు కొచ్చింది శారదకి. తను నిన్ననే ప్రమీలకి శంకరాభరణంలో గీతం సగమే చెప్పింది. ఇవ్వాళే ఈ అమ్మాయికి ప్రమీల చెప్పేస్తోంది. మెల్లగా లోపలికి వెళ్ళింది.

సుగుణ ఏమిటే విశేషం అంటూ దగ్గర కొచ్చింది. శారద సుగుణ చెవిలో రహస్యం చెప్పింది. 'ఓహ్ ఇంతేగదా! నువ్విక్కడే వుండు ఇప్పుడే తేల్చేస్తా'—ఒక్క పరుగున పక్కవాటా లోకి వెళ్ళింది. రెండుసార్లు పాడనిచ్చి "టీచర్ గారు, ఇది చాలా బాగుంది. పూర్తిగా సాహిత్యం ఒక్కసారి పాడండి వింటాను" అంది సుగుణ. అటునుండి జవాబు ఏమొచ్చిందో తెలీదు గానీ—కందగడ్డలా మొహం వేసుకుని ప్రమీల వెళ్ళిపోవడం గమనించింది శారద.

మర్నాడు క్లాసులో ఓ దులుపు దులిపేసింది శారద. సంగీతం నేర్చుకుని పాఠాలు చెప్పకూడ దని కాదు. నే చేస్తున్నదీ అదేకదా! కానీ కొంతకోర్సుని, కొంత జ్ఞానాన్నీ సంపాదించి చెప్పడం మొదలు పెట్టాలి. అంతేగానీ ఈ రోజు ఇక్కడ నేర్చుకుని రేపే ఇంకొకళ్ళకి మీరు చెప్తే ఎలా!—నా దగ్గర ఒక రోజు సరిగ్గా పాఠం అప్పచెప్పటం లేదు మీరు, ఎలా ఇంకొకళ్ళకి చెప్పగలుగుతున్నారు. మంచివో, చెడ్డవో—పిచ్చివో సందేహాలు వస్తుంటాయి పిల్లలకి. వాటికి సరైన సమాధానం చెప్పగలిగే స్థాయిలో టీచరుండద్దూ!...

శారద ఎందుకు అంత గట్టిగా ఉపన్యాసం ఇస్తోందో క్లాసులో ఎవరికీ అర్థం కాలేదు. తలొంచుకు వింది ప్రమీల. ఆ అమ్మాయి ఏమనుకుందో ఏమో... పాఠం చెప్పడం మాత్రం మానలేదు.

—సూరి సత్యవాణి